## మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

**మేడ్చల్, సెప్టెంబర్ 16. ప్రభాతవార్త :**
హోటళ్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వయించి, పరిశుభ్రంగా లేని, నాసిరకం వస్తువుల వాడకం దారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌కు శనివారం పిపిఎం నాయకులు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్‌లో గల అమ్మచేతి వంట హోటళ్లో మూడు రోజుల క్రితం బిర్యానీలో బొద్దింక రావడం దారుణమని, ఈ హోటల్‌పై వెంటనపే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. అధికారుల నిర్లక్ష్యం, తనిఖీల లోపం వల్ల ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఈ సందర్బంగా నాయకులు ఆరోపించారు. తినుబండారాలపై పర్యవేక్షణ లేకపోవడంతోనె ఇలాంటివి జరుగుతున్నాయని, అధికారులు వెంటనే స్పందించి ఇలాంటి హోటళ్లపై చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నరేష్,నాయకులు కొమురయ్య, రమేష్, ప్రశాంత్, శ్రీనివాస్, నర్సింగ్‌రావు,నర్సింహ, శేఖర్ పాల్గొన్నారు.



# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

# వార్త

# అపర భగీరథునికి అపూర్వ స్వాగతం

- మంత్రి సబితాఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికిన నాయకులు
- పల్లె పల్లె నుంచి ఉప్పెనలా తరలిన గులాభి సైనికులు
- దక్షణ తెలంగాణ వర ప్రధాయని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభోత్సవం



ముఖ్యమంత్రి వాహనంపై పూలజల్లు కురిపిస్తున్న నాయకులు, ప్రజలు.

**మహేశ్వరం, సెప్టెంబర్ 16, (ప్రభాతవార్త) :** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి భారీ కాన్వాయ్‌తో ప్రగతి భవన్ నుంచి బయలుదేరిన ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ, కందుకూరు వద్ద ఘన స్వాగతం పలికారు. గులాబీ జెండాలు, తోరణాలు, బ్యానర్లతో స్వాగతం పలికారు. రోడ్డుకు ఇరువైపులా పోటెత్తిన జనసందోహం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అభివాదలు చేస్తూ జై బీఆర్ఎస్ జైజై కేసీఆర్ అంటూ నినాదాలతో మార్మోగాయి. వారందరికీ అభివాదలు చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకు కదిలారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బస్ పై ప్రజలతో కలిసి బీఆర్ఎస్ పార్టీ నాయకులు పూల జల్లు కురిపించారు.

## ముఖ్యమంత్రి బందోబస్తు హల్‌చల్

**ఆమనగల్లు, సెప్టెంబర్16, ప్రభాతవార్త:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వెట్ రన్ ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ నుండి ఆమనగల్లు మీదుగా రోడ్డు మార్గంలో కొల్లాపూర్ నియోజకవర్గంలోని నార్లాపూర్ ఇంటెక్‌వెల్ వద్దకు బయలుదేరారు. ముఖ్యమంత్రి పర్యటనతో ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారి పోలీస్ దిగ్బంధనం చేశారు. అడుగడుగున ముఖ్య కూడళ్ళ వద్ద పోలీసులు పహారా కాస్తూ గస్తి నిర్వహించారు. ముఖ్యమంత్రి హై సెక్యూరిటీ సిబ్బందితో పాటు సాధారణ పోలీసులు వందల సంఖ్యలో బందోబస్తు నిర్వహించారు. పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించడంతో సాధారణ ప్రజలకు కాస్త ఇబ్బంది కలిగినట్లు కనిపించింది. మధ్యాహ్నం ఒకటిన్నర ప్రాంతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కాన్వాయ్ ఆమనగల్లు మీదుగా ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం వైపు బయలుదేరారు. దారి పొడవున ప్రజలు నిలబడి ముఖ్యమంత్రి రాకను ఆసక్తిగా గమనిస్తూ నిలుచున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బందోబస్తును చూసిన ప్రజలు ఆశ్చర్యంతో



ఆమనగల్లు మీదుగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వెట్ రన్ ప్రారంభించేందుకు ఆమనగల్లు మీదుగా కొల్హాపూర్ బయలుదేరుతున్న ముఖ్యమంత్రి వాహనం, కాన్వాయ్

## -భారీ భద్రత మధ్య తుక్కుగూడలో విజయభేరి కాంగ్రెస్ బహిరంగ సభ -సోనియా గాంధీ హామీలపైనే అందరి ఆసక్తి



# నేడే కాంగ్రెస్ సభ



**మహేశ్వరం సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకర్గం కేంద్రంలోని తుక్కుగూడలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ విజయబేరి బహిరంగ సభకు జిల్లా నుంచి పెద్ద మొత్తంలో జనసమీకరణకు కాంగ్రెస్ నాయకులు శ్రీకారం చుట్టారు. జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి అధ్యర్యంలో మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని మున్సిపాల్టీలు మండలాలు పట్టాణాలు గ్రామాల వారిగా పార్టీ నాయకులకు జనసమీకరణ భాధ్యతలను అప్పగించారు. పార్టీలో సీనియర్ నాయకులు దేవభాస్కర్ రెడ్డి,కొత్తమనోహర్‌రెడ్డి, చిగురింత పారిజాత నర్సిం్మరెడ్డి,ఎనుగు జంగారెడ్డి పాండురంగారెడ్డి వంటి సీనియర్లకు జనసమీకరణ కోసం కమిటిలు వేశారు. స్థానికంగా ఇప్పటికే అనేక గ్రామాలు పట్టణాల్లోని పార్టీ నాయకులు కార్యకర్తలకు బుతుకమీటిల వారిగా నియమకాలు చేశారు. బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత నర్సింహ్మారెడ్డి బడంగ్‌పేట పరిధిలోని పట్టణాలు కాలనీలు, దేవభాస్కర్‌రెడ్డి ఆర్‌కే పురంతోపాటు మరికొన్ని భాధ్యతలు అప్పగించారు. మహేశ్వరం తుక్కుగూడ, ప్రాంతాలకు కొత్త మనోహర్‌రెడ్డి, కందుకూర్ ప్రాంతానికి ఎనుగు జంగారెడ్డి పాండురంగారెడ్డిలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా మహేశ్వరం, షాద్‌నగర్, ఇబ్రాహింపట్నం, కల్వకూర్తి,రాజేంద్రనగర్, చేవేళ్ల, పరిగి,వికారాబాద్, తాండూర్ నుంచి కూడా జనసమీకరణ కోసం స్థానిక ఇంఛార్జీలను నియమించారు.రాచకొండ కమీషనర్ పరిదిలో ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్సందునా స్థానికంగా రాచకొండ కమీషనర్‌తో పాటు డిసిపిలు, ఎసిపిలు ప్రత్యేక భద్రత చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే పలు మార్లు స్థానికంగా డివిజన్ డిసిపిలు ఎసిపిలు కాంగ్రెస్ పార్టీ నిర్వహించే బహిరంగ సభ స్థలిని పరిశీలిస్తున్నారు.ఈ విజయబేరి సభకు వచ్చె కాంగ్రెస్ పార్టీ వివిఐపిల భద్రత పరమైన చర్యలను క్షుణంగా తెల్సుకుంటున్నారు. ఇప్పటికే కేంద్ర ఎస్‌పిజి భద్రత బలగాలు కూడా విజయబేరి స్థలానికి చేరుకొని ఏర్పాట్లను పరిశీలించారు. సభ స్థలిని వేదిక వద్ద తీసుకో వల్సిన భద్రత పరమైన వాటిపై చర్చించారు. ఈ బహిరంగ సభకు హాజరయ్యే ప్రజలకోసం ప్రత్యేక ఏర్పాట్లు విద్యుత్ దీపాలు, దూరంగా ఉన్న ప్రజలకు సభ వేదిక వద్ద జరిగే కార్యక్రమాలను ఎల్ఇడి స్క్రీన్ల ద్వారా ప్రత్యేక్షంగా దగ్గరనుంచి చూడడానికి వీలు కల్పిస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. సభ వేదిక కూడా పెద్ద సైజ్‌తో కూడా ఏర్పాటు చేశారు.సౌండ్ సీస్టమ్ కూడా ప్రజల అందరికి వినిపించే విదంగా మరింత దగ్గరలో ఏర్పాటు చేశారు.

## కందూకురులో ఏర్పాటు చేయనున్న మెడికల్ కళాశాల

**- రూ.176 కోట్ల నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్**

**- సీఎంకు ధన్యావాదాలు తెలిపిన మంత్రి సబితాఇంద్రారెడ్డి**

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబర్ 16, (ప్రభాతవార్త) :**
జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటులో భాగంగా చివరి దశ 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 8 కాలేజీల నిర్మాణానికి ప్రభుత్వం మొత్తం రూ.1,447 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ నిధులతో ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా కాలేజీలు, ల్యాబులు, సెమినార్ హాల్స్, అనుబంధ ఆసుపత్రి భవనాలు, హాస్టల్ భవనాలు నిర్మాణం, ఇతర వసతులను కల్పించనున్నారు. గద్వాల్, నర్సంపేట్, యాదాద్రిలో నిర్మించే కాలేజీలకు రూ.183 కోట్లు చొప్పున, కుత్బుల్లాపూర్ కు రూ.182 కోట్లు, నారాయణ్‌పేట్, ములుగు, మెదక్‌లో నిర్మించే కాలేజీలకు రూ.180 కోట్లు చొప్పున, మహేశ్వరంకు రూ.176 కోట్లు కేటాయించారు. కొత్త మెడికల్ కాలెజజీల నిర్మాణాలకు సంబంధించి ఆరోగ్యశాఖ, ఆర్ అండ్ బి, అధికారులు అధ్యయనం చేసి కాలేజీల నిర్మాణానికి రూ.1447 కోట్ల అంచనా ప్రతిపాదనలు సమర్పించారు. వీటికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2014 వరకు తెలంగాణలో 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండగా, జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ సంకల్పించారు. ఇందులో భాగంగా శుక్రవారం 9ప్రభుత్వ మెడికల్ కాలేజీలను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. దీంతో రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య 26కు చేరింది. వచ్చే ఏడాది గాను మరో 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసింది. దీంతో ప్రభుత్వ మెడికల్‌కాలేజీల సంఖ్య 34 అయ్యింది.

**8 మెడికల్ కాలేజీల పనులు వేగంగా పూర్తి : మంత్రి హరీశ్‌రావు**

8 కాలేజీల నిర్మాణానికి రూ.1447 కోట్లు నిధులు కేటాయించినందుకు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యావాదాలు. ఉమ్మడి పాలనలో జిల్లాకోక డిగ్రీ కాలేజీలు కూడా లేని పరిస్థితి. వైద్యం, వైద్య విద్య అందని ద్రాక్షగా మారిన రోజులు. ఇక అదంతా గతం. సీఎం కేసీఆర్ దార్శనిక పాలనలో జిల్లాకో మెడికల్ కాలేజీ మంజూరు చేసుకున్నాం. ఏటా 10వేల మంది వైద్యుయలను తయారు చేసే స్థాయికి చేరుకున్నాం. వచ్చే ఏడాదిలో ప్రారంభించే 8 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణాలను వేగంగా పూర్తిచేసి, ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. తెలంగాణ ప్రజలకు వైద్యం, వైద్య విద్య కష్టాలను దూరం చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుంది. బీఆర్ఎస్ సర్కార్ పాలనలో తెలంగాణ మెడికల్ హబ్‌గా అవతరించింది.

## మేడ్చల్ మున్సిపల్ సమావేశం



మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వయించిన కౌన్సిల్ సమావేశం

**మేడ్చల్, సెప్టెంబర్ 16. ప్రభాతవార్త :**
మేడ్చల్ మున్సిపల్ సాదారణ సర్వసభ్య సమావేశాన్ని మున్సిపల్ చైర్మన్ దీపికా నర్సింహారెడ్డి అధ్యక్షతన మున్సిపల్ సమావేశం మందిరంలో శనివారం నిర్వయించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటిలోని 23 వార్డులల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం పలు అంశాలతో పాటు సమావేశంలో ప్రవేశపెట్టిన 31 అజెండా అంశాలపై చర్చించారు. ఈ అజెండా అంశాలకు గాను రూ.293.60 లక్షల నిధుల అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు అమోదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మశ్, కమిషనర్ త్రిళ్లేశ్వర్ రావు, 17 మంది కౌన్సిలర్లు, ముగ్గురు కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## సిఎం కాన్వాయ్‌ని అడ్డుకునేందుకు యత్నం

**-నలుగురు బిజెవైఎం నేతలపై కేసులు నమోదు**

**ఆమనగల్లు, సెప్టెంబర్16, ప్రభాతవార్త:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వెట్‌రన్ ప్రారంభించేందుకు హైదరాబాద్ నుండి కొల్హాపూర్‌కు ఆమనగల్లు పట్టణం మీదుగా రోడ్డు మార్గం నుండి వెళుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ వాహనాన్ని అడ్డుకునేందుకు పలువురు బీజేవైఎం నేతలు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు, ప్రత్యేక సెక్యూరిటీ విభాగం వెంటనే వారి యత్నాన్ని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం సిఎ కాన్వాయ్ పట్టణంలోకి రాగానే పూల శ్రీను దుకాణం ఎదురుగా వీధుల నుండి బీజేవైఎం నేతలు సిఎం కాన్వాయ్ వాహనాలకు ఎదురు వెళ్ళారు. అక్కడి ఉన్న మహిళా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసిన బీజేవైఎం నేతలు దూసుకుపోయి బీజేవైఎం జెండాలను ప్రదర్శిస్తూ సిఎం వాహనానికి అడ్డుగా వెళ్ళారు కాన్వాయ్‌లోని సెక్యూరిటీ సిబ్బంది వెంటనే వారి అడ్డు తొలగించడంతో ముఖ్యమంత్రి వాహనాలు సజావుగా ముందుగా సాగిపోయాయి. అడ్డుకునే యత్నం చేసిన నలుగురు బీజేవైఎం నేతలు వగ్గు ప్రభాకర్, శ్రీకాంత్, బాలకృష్ణ, శ్రీహరిలపై కేసులు నమోదు చేసినట్లు సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై బల్‌రాంనాయక్‌లు తెలిపారు.

## రంగారెడ్డి జిల్లాలో జోరుగా మూడుముక్కలాట!

**- ఫాం హౌజ్‌లు,మామిడి తోటలే అడ్డాలు**
**- రోడ్డున పడుతున్న నిరుపేద కుటుంబాలు**
**- రూ.లక్షల్లో చేతులు మారుతున్న వైనం**
**- సకల సౌకర్యాలతో స్థావరాలు..**

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్16, ప్రభాతవార్త:**
రంగారెడ్డి జిల్లాలో మూడుముక్కలాట జోరుగా సాగుతుంది.సామాన్యుల నుంచి,సంపన్నుల వరకు జూదాన్ని వ్యసనంగా మార్చు కొని సంపాదనంత తగలేసుకుంటున్నారు.కుటుంబాలను ఆగం చేసుకుటున్నారు.కోందరు తెల్లవార్లూ అదేపనిగా జూదాన్ని ఆడుతూ జివితాలను ఆగం చేసుకుంటున్నారు.జనావాసాలకు దూరంగా ఉండే మామిడి తోటలు.పంట పోలాలు. ఫాంహౌజ్‌లు అడ్డాగా ఎంచుకుంటున్నారు.పేకాట రాయుళ్ల ఎక్కువగా జనసంచారంలేని శివారు ప్రారంతాల్లో గదులను అద్దేకు తీసుకుంటున్నారు. పేకాట కోసం ప్రత్యేక శిభిరాలు ఏర్పాటు చేసుకొని యథేశ్చగా నడిపిస్తున్నరు.

**పంట పోలాలు,ఫాంహౌజ్‌లు..**

ప్రజలకు దూరంగా ఉండే మామిడి తోటలు,పంట పోలాలు,ఫాంహౌజ్‌లను వేదికగా చేసుకొని పేకాట కొనసాగిస్తున్నారు.ఇబ్రహీంపట్నం,మహేశ్వరం, షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాల్లోని శివారు గ్రామల్లో జనసంచారంలేని ప్రాంతాల్లో ప్రత్యేక శిభిరాలను ఏర్పాటు చేసుకొని యథేశ్చగా పేకాట ఆడుతున్నారు.తరచూ స్థావరాలు మారుస్తూ ఎవరికి అనుమానం రాకుండ నిర్వహిస్తుంటారు.పేకాట స్థావరాలకు చేరుకొవడానికి పేకట రాయుళ్ల అత్యంత రహస్యంగా పత్యేక కోడ్ భాషను ఉపయోగించి సమాచారం అందించుకుంటున్నారు.



**సకల సౌకర్యాలతో స్థావరాలు..**

పేకాట ఆడేవారికి ఏ అవసరం వచ్చిన బయటికి వెళ్లేపని లేకుండ నిర్వాహకులు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు.స్థావరాల వద్దకే సమీప ప్రాంతాల్లో హోటళ్లు,దాబాలు నిర్వహిస్తున్న వ్యక్తులు పేకాట రాయుళ్లకు భోజనం, మద్యాన్ని సమకూరుస్తున్నారు.డబ్బు అవసరమైతే స్థావరాల వద్దే తాకట్టు పెట్టుకొని డబ్బును సైతం ఇచ్చేవారు ఉంటున్నారు.ఆస్థి పేపర్లు, నగలు, వాహనాలు తకట్టు పెట్టుకొని అధిక వడ్డీకి అప్పులు ఇస్తుంటారు.

**రూ.లక్షల్లో చేతులు మారుతున్న డబ్బు..**

జిలాల్లో ప్రధానంగా మూడు ముక్కలు,రమ్మీ ఆటలు ఆడుతుంటారు.పేకాట రాయుళ్ల డబ్బులు పెట్టే స్థాయిని బట్టి గ్రూపులుగా విభజించి నిర్వహకులు ఆటను ఆడిస్తున్నారు.ఆటకు రూ.వెయ్యి నుంచి ప్రారంభించి రూ.10వేల వరకు ఆటలను నిర్వహిస్తున్నారు.ఒక్కొ అటలో తోమ్మిది మంది గ్రూపుగా ఏర్పాటు చేయడంతో ఆటకు రూ.9 వేల నుంచి రూ90వేల వరకు అవుతుంటాయి.నిర్వహకులు మాత్రం ఒక్కొ అటకు అటను బట్టి కమీషన్లు వసూలు చేస్తుంటారు.దీంతో లక్షల్లో డబ్బు చేతులు మారుతుంది.

**పోలీసుల నిర్లక్ష్యం..**

జిల్లాలో పోలీసుల నిర్లక్ష్యంతో పేకాట రాయుళ్ల రోజురోజుకు పెరుగుతున్నారు.జూదగాళ్లపై చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తున్నామని చెపుతున్నా అవి కేవలం మాటలకే సరిపోతున్నాయి.ఎదో తూతూ మంత్రంగా అప్పుడప్పుడు పేకాట రాయుళ్లను పట్టుకొని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.పోలీసులు పేకాట స్థావరాలపై ప్రత్యేక దృష్టి సాధించాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రతి ఒక్కరూ మట్టి గణపయ్యలను పూజించాలి

**-జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్**

**వికారాబాద్,సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:**
జల వనరులు, చెరువుల నీరు కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్ లు సంయుక్తంగా పేర్కొన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నివారణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్ లు అధికారులకు, సిబ్బందికి మట్టి గణపతిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వినాయక చవితిని శ్రద్ధగా భక్తిశ్రద్ధలతో పూజించి, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను 9 రోజుల తర్వాత నిమజ్జనం చేస్తూ ఉంటామని, దీనివల్ల జల వనరులు చెరువులు కాలుష్య బారిన పడి వృక్ష, జంతు జీవనంపై ప్రభావం పడుతుందన్నారు. సహజంగా మట్టితో చేసిన వినాయక విగ్రహాలను వినియోగిస్తే దుష్ప్రభావాలు పడకుండా ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని సూచించారు. ఇరుగు పొరుగు కుటుంబంలోని సభ్యులందరూ సైతం మట్టి గణపతి విగ్రహాలు వినియోగించేలా అందరికి అవగాహన కల్పించాలని అన్నారు.



మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్

కాలుష్య నివారణ మండలి ఆధ్వర్యంలో పట్టణంలో రెండు వేల మట్టి విగ్రహాలను పంపిణీ చేయ న్నట్లు తెలిపారు. అనంతరం మట్టి గణపతులనే నెలకొల్పు కోవాలి అనే సందేశం గల గోడపత్రికను అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ పర్యావరణ ఇంజనీర్ వెంకట నర్సు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల మానవహారం

**-అంగన్‌వాడి టీచర్ల,హెల్పర్స్‌నుపర్మినెంట్ చేయాలంటూ డిమాండ్ -ఏఐటియుసి రాష్ట్ర ఉపకార్యదర్శి నరసింహ**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 16, ప్రభాతవార్త**
మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందు అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మానవహారం.. ధర్నా..నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఏఐటియుసి,సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడి టీచర్ల, హెల్పర్ల ధర్నా,నిరసనల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగ పాల్గొన్న ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీ టీచర్లను, హెల్పర్లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గత ఆరు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగ అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెలో ఉండి ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవటం దారుణమన్నారు. కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ టీచర్లు,హెల్పర్లు మానవహారం కార్యక్రమంను నిరసనగ నిర్వహించటం జరిగిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగ సుమారు 70వేల మంది వరకు అంగన్‌వాడీలు సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలి పారు. ప్రభుత్వం వారి సమస్యలు పట్టకుండ పరిష్కరించకుండ కుంటి సాకులు చెప్పటం దారుణమని ఆయన విమర్శించారు. గత అనేక సంవత్సరాలుగ వారిని రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కనీసవేతనం 26వేల రూపాయలు చెల్లించాలని,గ్రాచ్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంపు ఇతర సమస్యలను పరిష్కరించా లని అప్పటి వరకు ఈ సమ్మె కొనసాగుతుందన్నారు.అంగన్‌వాడిలను ప్రభుత్వ ఉద్యోగులుగ, కార్మికులుగ గుర్తించకుండ వారిని నుంచి శ్రమదోపడి చేయించుకుంటున్నారన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు అశోక్, ఏఐటియుసి అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్‌యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పారిజాన్, నాయకులు శ్రీనివాస్, హరినాథ్‌రావు, అంగన్‌వాడి కార్యకర్త లు,హెల్పర్స్, తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేసి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్,పాల్గొన్న కార్మిక యూనియన్ నాయకులు

## డిజేలు పెడితే కేసులే..?

**-సార్ మెం ఎలా బ్రతకాలి**

**-డిజే యాజమానులు పోలీసులకు మొర**

**నందిగామ సెప్టెంబర్16,ప్రభాతవార్త :** పల్లెలో డిజేల శబ్ధం వినిపిస్తే చాలు వెంటనే యజమానులుపై కేసులే అంటున్న పోలీసులు లక్షలు వెచ్చించి డిజేలను కొనుగోలు చేసిన యజమానులు ఆందోళనకు గురవుతున్నారు.పండుగలకు,వివిధ కార్యక్రమాలకు డిజే పర్మిషన్ లేదంటూ పోలీసులు డిజే యజమానులపై ఉక్కుపాదం మోపుతున్నారు. దీంతో తమకు ఉపాధి పోతుందని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నందిగామ మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న డిజే యజమానులు తమ పరిస్థితి ముందు గోయ్యి వెనక నుయ్యి అనే చందంగా తమ పరిస్థితి దాపురించిందని చెబుతున్నారు.డిజేలతో పలు ప్రభుత్వ ,ప్రైవేట్ కార్యక్రమాలతో పాటు వివాహాది శుభకార్యాలకు ఏర్పాటు చేసి ఉపాధి పొందేవారు అయితే పోలీసులు మాత్రం రాత్రుల్లో గ్రామాల్లో డిజేల ఏర్పాటుతో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని అందుకే వాటిని పూర్తిగా నిషేందించేందుకు చర్యలకు ఉపక్రమించిందని చెబుతున్నారు.డిజేలు లేకపోతే మండలమంతా మూగపోయినట్లు అవుతుందని పలువురు భావిస్తున్నారు.అదేవిధంగా లక్షలు పెట్టుబడి పెట్టి డిజేలను ఏర్పాటు చేయకుండా మూలకు వేసేనత తమ ఉపాధి పోయి కుటుంబ పోషణ భారమయ్యే పరిస్థితి నెలకొంటుందని వాపోతున్నారు.డిజే యజమానుల దుస్థితిపై కనికరించి ఇప్పటికైన పోలీసు ఉన్నతాధికారులు మరోసారి ఆలోచించి డిజేల ఏర్పాటుకు అనుమతి కల్పించి తమకు తిరిగి ఉపాధి పొందెందుకు సహకరించాలని కోరుతున్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు పిఆర్‌టియు మద్దతు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 16, ప్రభాతవార్త**
సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు చేస్తున్న నిరవధిక రిలే నిరాహారదీక్షలకు (సమ్మెకు) మేడ్చల్ జిల్లా పిఆర్‌టియు తెలంగాణ సంఘం టీచర్లు పాల్గొని వారికి మద్దతు తెలిపారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న రిలే నిరహారదీక్షలకు (సమ్మెకు) వారు మద్దతు పలికారు. ఈ సందర్భంగ మేడ్చల్ జిల్లా పిఆర్‌టియు తెలంగాణ అధ్యక్షులు ఎం. మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు రిలేనిరహారదీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.శ్రీధర్, శామీర్‌పేట మండల అధ్యక్షులు రామిడి వెంకట్రామ్‌రెడ్డి, మల్కాజ్‌గిరి మండల అధ్యక్షులు కె.శ్రీనివాస్‌రావు, కాప్రా మండల అధ్యక్షులు ఎన్.మల్లేశం, తదితరులు పాల్గొన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు పలువురు రిలేనిరహారదీక్షలు కూర్చుని నిరసనలు తెలియజేశారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు పిఆర్‌టియు తెలంగాణ ఉపాధ్యాయ సంఘం మేడ్చల్ జిల్లా నాయకులు పాల్గొని మద్దతు తెలిపిన దృశ్యం

## విజయభేరి సభను విజయవంతం చేయాలి

**యాచారం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**

ఈ నెల 17న హైద్రాబాద్ తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభను విజయవంతం చేయాలని వైస్ ఎంపిపి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖర్జున్ ఖర్గే, ఇతర జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకులు విజయభేరి సభకు హాజరవుతున్నందున మండలంలోన్ని గ్రామాల నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయభేరి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అమృతసాగర్, ఎంపిటిసి అరవింద్ నాయక్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, రాజిరెడ్డి, రవి, రాకేష్, మహేష్, మధుకర్, నగేష్ పాల్గొన్నారు.

## నల్లవెల్లి సర్పంచ్ దేరంగుల ఆధ్వర్యంలో బిజెపిలో చేరిక


బిజెపిలో చేరిక దృశ్యం

**యాచారం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**

మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామ సర్పంచ్ దేరంగుల రాజు ఆధ్వర్యంలో గ్రామంలో చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై నల్లవెల్లి, నల్లవెల్లి తండాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్య కర్తలు శనివారం పెద్ద ఎత్తున సర్పంచ్ రాజు ఆధ్వర యంలో బిజెపిలో చేరారు. పార్టీలో చేరిన వారిలో జరుపుల లక్ష్మణ్, రమావత్ చందర్, సభావత్ భాస్కర్, హునా, మారయ్య, జిల్లా రోశయ్య, బందెల అంజయ్య, నర్సింహ, పెరుమాండ్ల రాములు, ఏర్పుల కృష్ణయ్య, రవీందర్, బుగ్గయ్య, ఆలంపల్లి వెంకటయ్య, జిట్టే సత్తయ్య, గిరి కృష్ణ ఉన్నారు.

## కాంగ్రెస్ సభను విజయవంతం చేయాలి

### -సపావత్ మధుకర్‌నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మధుకర్

**యాచారం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**

నేడు హైద్రాబాద్‌లోని తుక్కుగూడలో నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సపావత్ మధుకర్ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చింది సోనియా గాంధీ అని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి జరుగుతుందని రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.వంద సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ నేడు అధికారంలోకి వచ్చి పూర్వ వైభవం సాధిస్తుందని ప్రజలు కాంక్షిస్తున్నారన్నారు.

## వినాయక మండపాల విద్యుత్‌కు రుసుం చెల్లించాలి

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:**

గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేస్తున్న వినాయక మండపాలకు నిర్వాహకులు విద్యుత్‌శాఖకు నిర్ణిత రుసుం చెల్లిస్తే తాత్కాలిక సరఫరా చేస్తామని మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ ఏఇ సతీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుంచి 28 వరకు గణేశ్ ఉత్సవాలను నిర్వహించనున్నారని ఈమేరకు ఎల్‌టి లైన్ నుంచి కరెంట్ ఇవ్వడానికి అనుమతి తీసుకోవాలని టిఎస్ఎస్‌పిడిసిఎల్ సీజీఎం ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. ఘట్‌కేసర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో గణేశ్ ఉత్సవాల నిర్వహకులు మండపాల వద్ద లైటింగ్ కోసం 250 వాట్స్ వరకు విద్యుత్ వినియోగానికి రూ.500లు, 250 నుంచి 500 వాట్స్ వరకు రూ.1,000లు, 500 వాట్స్ పై వినియోగానికి రూ.1,500లు, 1000 వాట్స్‌కు పైగా రూ.750 ప్రతి 500 వాట్స్‌కు రుసుం చెల్లించాలని ఆయన సూచించారు. ఘట్‌కేసర్‌లోని విద్యుత్ కార్యాలయంలో గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తప్పనిసరిగా వినాయక మండపాలకు కరెంట్ సరఫరా తీసుకోవడానికి నిర్ణిత రుసుము చెల్లించి రశీదు పొందాలని ఆయన పేర్కొన్నారు.

## ఓటరు నమోదుపై అవగాహన


ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఐటిఐ విద్యార్థులు

**మేడ్చల్, సెప్టెంబర్ 16. ప్రభాతవార్త :**

మేడ్చల్ పట్టణంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఐటిఐలో మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ త్రిళ్లేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై అవగాహ కార్యక్రమాన్ని శనివారం నిర్వయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఫాం 6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని నిజమైన ప్రజా సేవ చేసే నాయకుడిని ఓట ద్వారా ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా కో ఆర్డినేటర్ నరేష్, ఆర్పీలు, బిఎల్ఓలు, మున్సిపల్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

**తలకొండపల్లి సెప్టెంబర్16,ప్రభాతవార్త :**

18 నుండి 22వరకు జరగే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని ఎమ్మార్పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు.శనివారం తలకొండపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో 2వ రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా పలురువు మాట్లాడుతూ...హైదరాబాద్‌లో జరుగుతున్న కాంగ్రెస్ సిడబ్ల్యుసి సమావేశంలో ఎస్సీ వర్గీకరణ అంశం పై ప్రతిపక్ష పాత్ర పోషించాలన్నారు.కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని వెంటనే ఎస్సీ వర్గీకరణ చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ జిల్లా కార్యదర్శి కిరణ్ పూలే,ఎమ్మార్పిఎస్ నాయకులు పోతుగంటి మహేష్ ,మల్లేష్, మీసాల మహేష్,జంగయ్య,కిరణ్,భరత్ ,రవితేజ ,అదేశ్ ,రమేష్,గణేష్,సందీప్,సురేష్,శివ,వంశీ,తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలి

**-అక్రమార్కులకు మంత్రి మల్లారెడ్డి, బీఆర్ఎస్ నేతల అండ**
**-కోట్లాది రుపాయల కుంభకోణంలో కమిషనర్ల పాత్ర**
**-అవినీతిపై బిజెపి రాజీలేని పోరాటం: ఎంపిపి**


ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి తదితరులు

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో జరిగిన ఆర్థిక కుంభకోణంలో కమీషనర్ల హస్త ముందని బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లోని బిజెపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, సీబీఎఫ్‌సీ సభ్యులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డితో కలిసి మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలో మంత్రి మల్లారెడ్డి కుమ్మక్కై అధికారులు బదిలీపై ఇక్కడి వచ్చి అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడూ అందిన కాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. లంఛాలకు అలవాటు పడి డబ్బులు వసూలు చేసి మంత్రికి పంపిస్తుండంతో ఆయన అధికారులపై ఏలాంటి చర్యలు తీసుకోకుండా సహకరిస్తున్నారని, గతంలో అవినీతి అధికారులను ఏసీబీ పట్టుకున్నా లంఛాలు తగ్గడం లేదన్నారు. సా ్వహ చేసిన డబ్బులు రూ.3.13 కోట్లు మున్సిపల్ ఖాతాలో జమ చేసిన వారిని గుర్తించి ఇంతపెద్ద మొత్తంలో డిపాజిట్ చేశారంటే కుంభకోణంలో హస్తమున్నట్లు తెలుస్తోందని, దీనిపై లోకాయుక్త, ఏసీబీ అధికారులకు బిజెపి ఫిర్యాదు చేస్తుందని తెలిపారు. మేడ్చల్ జిల్లాలోని 3 కార్పొరేషన్లు, ఏడు మున్సిపాలిటీలు, 5 మండలాల్లో బిల్‌కలెక్టర్లు డబ్బులు దుర్వినియోగం చేయడం పరిపాటిగా మారిందని అడిటింగ్ చేస్తే అక్రమాలు వెలుగులోకి వస్తాయని ఎక్కువ కాలం ఒకే దగ్గర పనిచేస్తున్న బిల్‌కలెక్టర్లను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో రూ.3.13 కోట్లు ప్రజల నుంచి వసూలు చేసిన ఇంటి పన్నులు కమీషనర్ల పాత్ర లేకుండా బిల్‌కలెక్టర్ హేమంత్‌కుమార్ స్వాహ చేయడం అనుమానాలు తావిస్తుందని, ఈవ్యవహారంలో ఉన్నత స్థాయి అధికారులు మేనేజర్లను సస్పె ండ్ చేసి నిధుల గోల్‌మాల్‌కు కారణమైన కమీషనర్లను వదిలిపెట్టారని విమరి ్శంచారు. అవినీతి, అ క్రమాలపై బిజెపి నిరంతరం పోరాటం చేస్తుందని ఎంపిపి స్పష్టం చేశారు. ఈసమావేశంలో మున్సిపల్ ప్రధానకార్యదర్శి బొక్క రవీ ందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ మాయ నరేశ్, నాయకులు వీరేశం, విక్రాంత్‌రెడ్డి, శివకుమార్‌నాయక్, శ్రీకాంత్, మధుసూధన్‌రెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద వినాయకుల నిమజ్జనం కోసం ముందస్తు ఏర్పాట్లు


శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద వినాయకుల నిమజ్జనం కోసం శానిటేషన్ అమలు పనులను పర్యవేక్షించిన ఎంపిడిఓ జి.వాణి,పాల్గొన్న ఎంపిఓ,సెక్రటరీ సిబ్బంది

**శామీర్‌పేట, సెప్టెంబరు 16, ప్రభాతవార్త**

వినాయకుల నిమజ్జనం ఏర్పాట్ల సందర్భంగ శామీర్‌పేట పెద్ద చెరువులోని ప్రాంగణం వద్ద ముందస్తుగా శానిటేషన్ పనులను చేపట్టారు. శనివారం శామీర్‌పేట పెద్ద చెరువును ఎంపిడిఓ జి.వాణి సందర్శించి శానిటేషన్ పనులను పరిశీలించారు. శామీర్‌పేట గ్రామపంచాయతీ సిబ్బంది పారిశుధ్యం (శానిటేషన్) పనులను చేపట్టారు. అదే విధంగ వినాయకుల నిమజ్జనం సందర్భంగ చెరువు ఒడ్డున గల ఖాళీ స్థలంలో భూమిని చదును పనులను జెసిబితో చేపట్టారు. చెరువు ప్రాంగణంలో చెత్తాచెదారంను తొలగించటానికి శామీర్‌పేట గ్రామపంచాయతీ వర్కర్స్ పనులు చేపట్టారు. చెరువు నీటిలో కూడ కట్టవైపున చెత్తచెదారం ఉండటంతో దాన్ని తొలగించటానికి చెరువులో నీరు నిండుగ ఉన్నందున జాగ్రత్తగ సిబ్బంది చెత్తను తొలగించాల్సిన అవసరం ఉంది. అయితే శామీర్‌పేట పెద్ద చెరువులో వినాయకుల నిమజ్జన ఏర్పాట్ల కోసం జిల్లా కలెక్టర్ వివిధశాఖల అధికారులకు బాధ్యతలను అప్పగించటం జరిగింది. వినాయకుల నిమజ్జనంకు సంబంధించి చెరువుల వద్ద తగు ఏర్పాట్లు చేయటానికి వివిధ శాఖల అధికారులు ఇప్పటికే పర్యటించి పరిశీలించటం జరిగింది. అయితే శనివారం మాత్రం ఎంపిడిఓ జి.వాణి సందర్శించి పారిశుదం పనులను ప్రారంభించి ఏర్పాట్లను పరిశీలించటం జరిగింది. ఇక తూంకుంట మున్సిపాల్టీ కమిషనర్‌కు కూడ శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద వినాయకుల నిమజ్జనంకు ఏర్పాట్లును వివిధశాఖల అధికారులతో పాటు ఎంపిడిఓతో కలిసి తూంకుంట మున్సిపాల్టీ కమిషనర్ ఏర్పాట్లు చూడాలని ఉత్తర్వులు ఉన్నా ఇంత వరకు శామీర్‌పేట పెద్ద చెరువును ఆ మున్సిపల్ కమిషనర్ మాత్రం చెరువును సందర్శించలేదని సంబంధిత అధికారుల నుంచి సమాచారం. కలెక్టర్ ఉత్తర్వులు ఉన్నా మున్సిపల్ కమిషనర్ పాల్గొనక పోవటం పట్ల ఇక బాధ్యత గల అధికారులు ఎలా సమన్వయంతో వెళ్లారనేది వేచి చూడాల్సిందే మరీ..సోమవారం వినాయక చవితి పండుగ, వినాయక ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆ తరువాత మూడవ రోజు నుంచి శామీర్‌పేట పెద్ద చెరువుకు వినాయకులను నిమజ్జనం కోసం ఊరేగింపులుగా తీసుకవచ్చి పూజలు చేసి నిమజ్జనం చేయనున్నారు. సాధారణంగ అయితే 3వ,5,7,9.11వ రోజులలో వినాయకులను చెరువులో పూజలు చేసి నిమజ్జనం చేయనున్నారు. శామీర్‌పేట మండల పరిధిలో తూంకుంట మున్సిపాల్టీ ఉండటంతో శామీర్‌పేట పెద్ద చెరువు ఏర్పాట్ల విషయంలో మున్సిపల్ కమిషనర్‌కు కూడ బాధ్యతలు అప్పగించారు. ఈ ఏర్పాట్లలో పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్అండ్‌బి, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, వైద్య,ఆరోగ్యం, ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొనాల్సి ఉంది. ఇక ఆదివారం నుంచి వినాయకుల నిమజ్జనం కోసం శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద బారికేట్స్ వంటివి మరిన్ని ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

## ఊపందుకున్న గణేశ్ విగ్రహాల అమ్మకాలు

### -కొనుగోళ్లతో మార్కెట్ కిటకిట


ఘట్‌కేసర్ విక్రయానికి సిద్ధంగా ఉన్న గణేశ్ విగ్రహాలు

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:**

వినాయకచవితి సందర్భంగా గణేశ్ విగ్రహాల అమ్మకాలు ఊపందుకున్నాయి. సోమవారం వినాయకచవితి పండగను భక్తి, శ్రద్ధలతో నిర్వహించుకునేందుకు ప్రజలు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఘట్‌కేసర్, బైపాస్‌రహదారి, ఘణాపూర్, జోడిమెట్ల, వెంకటాపూర్, చౌదరిగూడ, ఎదులాబాద్‌రోడ్డులో వినాయక విగ్రహాలను విక్రయిస్తున్నారు. గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వహకులు పెద్ద విగ్రహాలను కొనుగోలు చేసి లారీలు, ట్రాలీలలో తమ గ్రామాలకు తరలిస్తుండగా మరికొందరు నగరంలోని దూలీపేట్, నాంపల్లి నుంచి భారీ ప్రతిమలను లక్షల రుపాయలు వెచ్చించి ఖరీదు చేస్తున్నారు. వినాయకచవితి ఒక్క రోజే ఉండటంతో నిర్వహకులు మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఘట్‌కేసర్‌లో వినాయక విగ్రహాలు,పూజాసామాగ్రీ, పూలు,పండ్ల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. ఘ ట్‌కేసర్ పట్టణంలో రహదారి వెంట మార్కెట్ రద్దీగా మారగా పలుచోట్ల రోడ్ల మధ్యలో మండపాలను ఏర్పాటు చేస్తుండటంతో ప్రజలకు ఇబ్బంది కరంగా మారిందని స్థానికులు అంటున్నారు.

## జీపీ కార్మికులను మోసం చేస్తే గుణపాఠం తప్పదు

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:**

గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చుతామని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దయాకర్‌రావు హమీ ఇచ్చి నెలరోజులు గడుస్తున్నా పరిష్కరించకపోవడం సిగ్గుచేటని మండల సీఐటియు కార్యదర్శి ఎన్.సభిత అన్నారు. ఘట్‌కేసర్‌లో శనివారం సిఐటీయు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ చౌరస్తాలో రహదారిపై కొద్దిసేపు నిరసన వ్యక్తం చేసి గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్లను తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 21 న సమ్మె నోటీసు ఇచ్చి 25 వ తేదీలోగా సంతకాల సేకరణ చేసి మద్దతు కూడకడతామని మూడు రోజుల పాటు జిల్లా కేంద్రాల్లో ధర్నా దీక్షలు చేపడుతామని సర్కార్ స్పందించకుంటే అక్టోబర్ 1న వేలాది మందితో హైదరాబాద్‌లో సభ జరుపుతామని ఆమె క్టోబర్ 2 నుంచి నిరవధికసమ్మె చేస్తామని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ సభ్యులు కడమంచి యాదగిరి, కె.చంద్రమోహన్, జి.నాగమణి, కార్మికుల యూనియన్ నాయకులు జంగయ్య, దేవయ్య, కిష్టమ్మ, బారతమ్మ, పద్మ, లక్ష్మి, కౌసల్య, లక్ష్మి పాల్గొన్నారు.

## విజయభేరి సభకు భారీ జనసమీకరణ

**షాద్‌నగర్, సెప్టెంబర్ 16, (ప్రభాతవార్త) :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న విజయభేరి సభను దిగ్విజయం చేయడానికి టీపీసీసీ రాష్ట్రప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో భారీ జనసమీకరణ చేపట్టారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ వద్ద నిర్వహించే ఈ సభకు శనివారం సాయంత్రం నాటికే వీర్లపల్లి శంకర్ 70 బస్సులను బుక్‌చేయించడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ వర్గీయులు తెలిపారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ శనివారం స్థానిక మీడియాతో మాట్లాడుతూ.... సభకు ఏఐసీసీ అధినాయకురాలు సోనియాగాంధీ, భావి ప్రధాని రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, తదితర అతిరథమహారథులు అందరు హాజరవుతున్నారని ఆయన వివరించారు. ముఖ్యంగా రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. విజయబేరి సభకు భారీ స్థాయిలో అభిమానులు, కార్యకర్తలు తరలి రావడం జరుగుతుందని వారికి ఏలాంటి అసౌకర్యం కలగకుండా అన్నిఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావడానికి ముందుకు వస్తుండటంతో ఇప్పటికే 70కి పైగా బస్సులను బుక్ చేయడం జరిగిందని, మరిన్ని బస్సులను బుక్ చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా కార్లు,తదితర వాహనాల్లో సుమారు 30 వేల మంది వరకు సభకు తరలి వెళ్లే అవకాశం ఉందని ఆయన వివరించారు


చేవెళ్ల గ్రామానికి చెందిన జూకన్నగారి జైపాల్‌రెడ్డి పావనిల కుమారుడు గీత్ శ్రీ నందన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి మందులను నిల్వ చేసుకునేందుకు ఫ్రిడ్జిని విరాళంగా అందజేశారు. ఆసుపత్రిలో మందులను ఉంచడానికి ఫ్రిడ్జి అవసరం ఉందని ఆసుపత్రి వైద్యులు శ్రీధర్ బాబు కోరడంతో వెంటనే స్పందించిన జూకన్నగారి జైపాల్‌రెడ్డి పావని దంపతులు ఆసుపత్రికి ఫ్రిడ్జిని అందజేశారు. సేవా భావంతో ఆసుపత్రికి ఫ్రిడ్జిని అందజేసిన జైపాల్‌రెడ్డిని ఆసుపత్రి సిబ్బంది ప్రతాప్‌రెడ్డి,శ్రీధర్‌లు అభినందించారు. (చేవెళ్ళ - ప్రభాతవార్త)

## విద్యార్థులు చెడువ్యసనాలకు బానిసలు కావోద్దు

**-న్యాయ వ్యవస్థపై పూర్తిగా అవగాహన ఉండాలి**
**-చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి సూచన**


చేవెళ్ల శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

**చేవెళ్ళ, సెప్టెంబరు 16, ప్రభాతవార్త**

విద్యార్థులు విద్యపైననే దృష్టి సారించాలని, విద్యార్థులకు చెడువ్యసనాలకు బానిసలు కావోద్దని చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి సూచించారు. శనివారం చేవెళ్ల శ్రీ చైతన్య జూనియర్ అండ్ డీగ్రీ కళాశాలలో నిర్వహించిన లీగల్ అవగాహన సదస్సుకు ముఖ్యఅతిధిలుగా చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి,జూనియర్ సివిల్ జడ్జి పిబి కిరణ్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులో విద్యలో మంచి ప్రతిభ కనబరుచాలన్నారు.కష్టపడి చదువుతేనే ఉన్నత శిఖరాలను సాదిస్తారన్నారు. మహిళలు భద్రతకు చట్టాలున్నాయని, లైంగిక దోపిడికి గురౌతున్న వారు న్యాయ సలహాలను తీసుకుని కెసులు నమోదు చేయాలన్నారు.మహిళల అక్రమ రవాణ నివారణకు మహిళ రక్షణలకు గల చట్టాలపై అవగాహన కల్పించారు. సోషల్ మిడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తే కఠినంగా చర్యలుంటాయన్నారు. వాహన చట్టాలపై పూర్తిగా తెలసుకోవాలన్నారు. న్యాయ సలహల కోసం న్యాయవాదులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల సిఐ లక్ష్మారెడ్డి, బార్ అసోసియోషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బి.యాదిరెడ్డి, కళాశాల యాజమాన్యం శ్రీకాంత్, ప్రిన్సిపాల్ శేఖర్, న్యాయవాదులు ఉపేందర్‌రెడ్డి, రామక్రిష్టా, కుమార్,ముక్తర్, సురేందర్, రవీందర్ తదితరులు పాల్గోన్నారు.

### ఏయూలో అంతర్జాతీయ సదస్సుకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో శనివారం ఐఈఈఈ ఏపీసీసీఏఎస్ 2023 రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను ప్రారంభించారు. సదస్సు జనరల్ చైర్ డాక్టర్ గోవిందాచార్యులు, ఏయూ ఉపకులపతి ఎస్.రామచంద్రం, జనరల్ చైర్ ప్రీత్‌యాదవ్‌ల చేతుల మీదుగా పోర్టల్‌ను ప్రారంభించారు. ఫ్లాగ్‌షిప్ ఆసియా-పసిఫిక్ కాన్ఫరెన్స్ 19వ ఎడిషన్, సర్క్యూట్‌లు, సిస్టిమ్‌లపై ఐఈఈఈ ఆసియా పసిఫిక్ కాన్ఫరెన్స్(ఏపీసీసీఏ-2023) భారతదేశంలో మొదటిసారిగా నవంబర్ 19 నుంచి 22 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాలుగురోజుల పాటు జరిగే సదస్సు హైదరాబాద్‌లో ప్రైమ్ ఏషియా 2023, టి-హబ్, వీఎల్ఎస్ఐ సర్క్యూట్, సిస్టిమ్ రంగంలో పనిచేస్తున్న దేశవ్యాప్తంగా ప్రముఖ సెమీకండక్టర్ పరిశ్రమలు, విద్యాస ంస్థలు, ప్రము ఖ పరిశోధకులు సమ్మేళనంలో భాగస్వాములు అవుతారని తెలిపారు. ఈసందర్భంగా జనరల్ చైర్ డాక్టర్ గోవిందాచార్యులు, ఏయూ ఉపకులపతి ఎస్.రామచంద్రం, జనరల్ చైర్ ప్రీత్ యాదవ్‌లు విలేకరులతో మాట్లాడుతూ సదస్సులో అనేక పరిశోధనా పత్ర ప్రదర్శనలు, డిజైన్ పోటీలు ఉంటాయని, ట్యుటోరియల్స్, కీనోట్ చర్చలు, స్టార్ట్ అప్ ఫోరమ్, ప్యానెల్ చర్చలు, ఇండస్ట్రీ ఇనో ్నవేషన్ ట్రాక్, ఉమెన్ ఇన్ సీఏఎస్ తదితర కార్యక్రమాలు జరుగుతాయని దేశ, విదేశాల నుంచి దాదాపు 400 మంది ప్రతినిధులు హజరు కానున్నారని వివరించారు. ఈకార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల, సీఈఓ ఎస్.నీలిమ, ఇంజనీరింగ్ డీన్ విజయ్‌కుమార్, ప్రొఫెసర్ అతుల్‌నేగి, డాక్టర్ జబ్బార్, జయప్రకాష్, రవీంద్ర, మంగళగౌరీ, నీరజ్‌జైన్, సంజీవ్‌బన్సాల్, సంతోష్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 16, ప్రభాతవార్త**

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఆదివారం ఉదయం జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నారు. ఆదివారం (17న) ఉదయం 9గంటలకు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద జాతీయ పతాకాన్ని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సిహెచ్ మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించనున్నారు. పోలీసుల నుంచి ఆయన గౌరవవందనం స్వీకరించను న్నారు. ఆ తరువాత మంత్రి మల్లారెడ్డి జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని తన సందేశాన్ని ఇవ్వనున్నారు. దీనిలో జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్లు, అధికార యంత్రాంగం, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొననున్నారు.

## కడ్తాల్ గ్రామ పోచమ్మ ఉత్సవ కమిటికి అభినందనలు

### -సర్పంచ్ గూడూరు లక్ష్మినరసింహారెడ్డి


పోచమ్మ ఉత్సవ కమిటి సభ్యులను సన్మానిస్తున్న సర్పంచ్ గూడూరు లక్ష్మి నరసింహారెడ్డి

**కడ్తాల్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :**

గ్రామ పంచాయతీ పరిధిలో శ్రీ పోచమ్మ అమ్మవారి దేవాలయం దగ్గర స్థానిక సర్పంచ్ గూడూరు లక్ష్మినరసింహారెడ్డి పోచమ్మ దేవాలయం ఉత్సవ కమిటి సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో నాలుగు రోజులపాటు జరిగిన బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన ఉత్సవ కమిటి సభ్యులకు వివిధ కుల సంఘాల పెద్దలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆధ్యాత్మిక చింతన ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని తెలిపారు. తెలంగాణ బోనాలు మన సంస్కృతికి, సంప్రదాయానికి ప్రతీకలని తెలిపారు. గ్రామంలో అంగరంగ వైభవంగా జరిగిన బోనాల పండగ సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణలో ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో విధులు నిర్వహించి గ్రామ పంచాయతీ సిబ్బందికి, వివిధ శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పోచమ్మ దేవాలయం ఉత్సవ కమిటి సభ్యులను శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు,శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రామకృష్ణ, ఉత్సవ కమిటి చైర్మన్ సత్యం, సభ్యులు చెగురి రాములు, గూడూరు శేఖర్‌రెడ్డి, మాలె మల్లేష్‌గౌడ్, కందికంటి వెంకటయ్యగౌడ్, సిలివెరు కృష్ణయ్య, భూమయ్య, నాగార్జున్, పాండు, బోసు వెంకటేష్, మూడ నరసింహ, చిన్న పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు చరమగీతం పాడడమే లక్ష్యం


కాంగ్రెస్ పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వీర్లపల్లి శంకర్

**జిల్లెడు చౌదరిగూడ, సెప్టెంబర్ 16,(ప్రభాతవార్త):**

బీఆర్ఎస్ పార్టీకి చమగీతం పాడడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని రావిర్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజెపి పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో కలిశారు. ఈ సందర్భంగా శంకర్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్న ఎక్కడ కూడ అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి మాత్రమె గ్రామాల్లో నేటికి ధర్శణమిస్తుందని ఆయన పెర్కోన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజు, శివకుమార్, భాస్కర్, రామకృష్ణ, నందు, సుధాకర్, మహేందర్, వీరేష్, రవి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేవాదాయ భూమి స్వాధీనం


షాబాద్‌లో శ్రీవేణుగోపాలస్వామి దేవాదాయ భూమిలో బోర్డును ఏర్పాటు చేసిన అధికారులు

**షాబాద్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :**

షాబాద్ శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధించిన భూములను శనివారం దేవాదాయ శాఖ అధికారులు ఆధీనంలోకి తీసుకున్నారు. షాబాద్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.1902లో 2ఎకరాల11గుంటల భూమిని దేవాదాయ శాఖ ట్రిబునల్ ఉత్తర్వుల మేరకు స్వాదీనపర్చుకున్నారు.దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, రంగారెడ్డి జిల్లా అధికారి ఆదేశాల మేరకు స్వాదీనపర్చుకుని, ఆ భూమిని గ్రామస్థులు సమక్షంలో దేవాదాయ భూమిగా గుర్తిస్తూ బోర్డు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో దేవాదాయశాఖ రెవెన్యూ స్పెషల్ డిప్యూటి కలెక్టర్ అనిత, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శేఖర్, మండల రెవెన్యూ సిబ్బంది, దేవాదాయ శాఖ వివిధ ఆలయాల ఈవోలు, సిబ్బంది మధుబాబు, దేవస్థాన ఈవో శ్రీనివాస్, గ్రామస్థులు ఉన్నారు.

## విద్యార్థులు లక్ష్యం దిశగా ముందుకు సాగాలి

### - డైరెక్టర్ వేణుగోపాల్ పిలుపు


చేవెళ్లలోని కెజిఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ఫ్రెషర్‌డేలో ఉత్తమ ఫలితాలు సాదించిన విద్యార్థులకు బహుమతులను అందజేసిన సిద్దార్థ విద్యాసంస్థల డైరెక్టర్ వేణుగోపాల్

**చేవెళ్ళ, సెప్టెంబరు 16, ప్రభాతవార్త**

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని, విద్యార్థులు జీవితంలో లక్ష్యంను ఎంచుకుని అడుగులు వేయాలని సిద్దార్ధ విద్యాసంస్థల డైరెక్టర్ వేణుగోపాల్ పిలుపునిచ్చారు.చేవెళ్ల మండల కేంద్రంలోని కెజిఆర్ గార్డెన్‌లో వివేకానంద జూనియర్ కళాశాల ఫ్రేషర్స్ డేను నిర్వహించారు. ఉత్తమ ఫలితాలను సాదించిన విద్యార్థులుకు కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి,డైరెక్టర్ ఇంద్రాసేనారెడ్డి,లు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సిద్దార్ధ విద్యాసంస్ధల డైరెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదువాలన్నారు. తల్లిదండ్రులు కష్ట పడి తమ పిల్లలను కళాశాలకు పంపిస్తున్నారని, ఎంతో నమ్మకంతో తల్లిదండ్రులు ఉన్నారని, వారి నమ్మకాలను వమ్ముచేయకుడదన్నారు. కష్టాలను ఎదుర్కోని ఉన్నత చదువులు చదువాలన్నారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.చెడు వ్యవసానాలకు దూరంగా ఉండాలన్నారు.

## రూ.6 లక్షలతో భూగర్భడ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు కేటాయిస్తున్నామని ఘణాపూర్ సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఘట్‌కేసర్ మండలం ఘణాపూర్‌లో రెండు చోట్ల శనివారం గ్రామపంచాయతీ నిధులు రూ.6 లక్షలతో చేపట్టనున్న భూగర్భడ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన వార్డుసభ్యులతో కలిసి కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించారు. 5వ వార్డు పరిధిలోని పవర్‌గ్రిడ్ ముందుకాలనీకి, మరో చోట మెయిన్‌రోడ్డు నుంచి వాటర్ కంపెనీ వరకు భూగర్భడ్రైనేజీ నిర్మాణం చేసేందుకు పనులు మొదలుపెట్టారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ వేముల పరమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ నానావత్ రూప్‌సింగ్‌నాయక్, వార్డుసభ్యులు చిలుగూరి భాస్కర్, వర్య పవన్‌నాయక్, వేముల పద్మ, వేముల శోభ, వేముల శ్వేత, కోఆప్షన్ సభ్యులు నానావత్ సురేశ్‌నాయక్, మాజీ ఉపసర్పంచ్ వేముల సత్తయ్యగౌడ్, మాజీ వార్డుసభ్యులు వేముల శంకర్‌గౌడ్, నాయకులు వేముల మహేశ్వర్‌గౌడ్, వేముల రాజు గౌడ్, గుగులోత్ సుమన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


పవర్‌గ్రిడ్ వద్ద డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ గోపాల్‌రెడ్డి

## అరుణోదయ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు



క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, క్లబ్ అధ్యక్షుడు పాండురంగారెడ్డి

**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:**
విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించాలి శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ తెలిపారు. శంకర్‌పల్లి అరుణోదయ యూత్ క్లబ్ వద్ద అధ్యక్షుడు జూలకంటి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో శనివారం అండర్ 14, 17 కబడ్డీ క్రీడలు జరిగాయి. ఈ సందర్భంగా విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. క్రీడలు శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక వికాసానికి కూడా తోడ్పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ శ్వేతా పాండురంగారెడ్డి, మాజీ సర్పంచ్ ప్రకాష్, అరుణోదయ యూత్ క్లబ్ మాజీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, క్లబ్ సభ్యులు సలీం, గౌస్, రంపాల్, చిన్న, లాలి, మైపాల్‌రెడ్డి, మనోహర్, నాగి, విక్రమ్ రెడ్డి, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## కోట్‌పల్లి బీసీ సెల్ అధ్యక్షుడిగా శ్రీనివాస్ ముదిరాజ్



బీసీసెల్ అధ్యక్షులుగా శ్రీనివాస్ ముదిరాజ్‌కు నియమక పత్రాని అందజేస్తున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్,

**కోట్‌పల్లి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త;**
కోట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులుగా శ్రీనివాస్ ముదిరాజ్‌ను శనివారం నాడు వికారాబాద్‌లోని మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ నివాసంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్బంగా బీసీ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తామన్నారు. మండలంలో పార్టీ బలంగా ఉందని వచ్చే ఎన్నికల్లో వికారాబాద్‌లో పార్టీ విజయం ఖాయమన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేసింది ఏమి లేదని కాంగ్రెస్ పార్టీ చేసిందే అభివృద్ధి పనులు ఉన్నాయన్నారు. అధికారంలోకి రాగనే ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందే విధంగా చూస్తమన్నారు. నాపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు దూద్యాల లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు, ఈకార్యక్రమంలో వికారాబాద్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు అయూబ్ అన్సారీ, కోట్‌పల్లి మండల అధ్యక్షులు నర్సింగ్ నాయక్, నాయకులు వాహిద్‌మియా, రాంచెందర్‌రెడ్డి(టిల్లు) ప్రభాకర్‌రెడ్డి, నర్సింహరెడ్డి, బిచ్చిరెడ్డి, అంజయ్య, రాజేశ్వర్‌రెడ్డి ,శ్రీనివాస్, మాధవ్, శశికుమార్, తదితరులు పాల్గోన్నారు.

## ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగియుండాలి

**-మండల బిఆర్ఎస్‌పార్టీ మాజీ అధ్యక్షుడు నారాయణ్‌రెడ్డి**



మంబాపూర్‌లో పల్లకీ ఊరెగింపులో పాల్గొన్న భక్తులు

**పెద్దేముల్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:**
ప్రతిఒక్కరు దైవచింతన కలిగియుండాలని మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సోసైటి డైరెక్టర్ ఎస్.నారాయన్‌రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో శ్రావణ మాసం ముగింపు సందర్భంగా భజన సమాప్తిలో భాగంగా శనివారం శ్రీ ఆంజనేయస్వామి పల్లకీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.నారాయన్‌రెడ్డి మాట్లాడుతూ నెల రోజుల పాటు గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో భజన చేసిన భక్తులకు ఆ భగవంతుడి కరుణ కటాక్షాలు ఉంటాయని ఆకాంక్షించారు. భగవంతుడిని నమ్ముకున్న వాడు ఏన్నడు చెడిపోరని, అందుకు ప్రతిఒక్కరు దైవనామ స్మరణను అలవర్చుకోవాలని అన్నారు. పల్లకీ ఊరెగింపు అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు ప్రసాద్‌గౌడ్, జె.నర్సిములు, ద్యావరి వీరారెడ్డి, తలారి రాము లు, టి,విజయ్, యం,రాములు, కె.శ్రీనివాస్, వై.రాములు, తాడి అంజి, సంగెం చంద్రప్ప, బంటారం భీమేష్, శ్రీనివాస్ గౌడ్, హెచ్.దస్థప్ప, జి,మల్లప్ప, వై,లాలప్ప, వై,బందెప్ప, వై,భీమప్ప, సిహెచ్.నర్సిములు, హెచ్,నర్సిములు, జి,బాల య్య, మంతటి లాలప్ప, బల్ల మల్లయ్య, శరత్‌తేజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**-ప్రథమశ్రేణీ న్యాయమూర్తి శ్రీరామ్**

**కొడంగల్, సెప్టెంబర్ 16ప్రభాతవార్త**
విద్యార్దులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కొడంగల్ మున్సిఫ్‌కోర్టు ప్రథమశ్రేణీ న్యాయమూర్తి శ్రీరామ్ అన్నారు. శనివారం స్దానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడారు. విద్యార్దులు విద్యాభివృద్దితో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రధానంగా విద్యార్దులు డ్రగ్స్, మత్తు మందు తదితర చెడు అలవాట్లు దూరంగా ఉంటూ ఉన్నత స్దాయిలో రాణించాలన్నారు. అంతేగాక కళాశాలల్లో ర్యాగింగులు తదితర వాటికి పాల్పడకుండా ఏకాగ్రత, పట్టుదలతో విద్యను అభ్యసిస్తు ఉన్నత స్దానాలకు చేరుకోవాలన్నారు. అంతకుముందు పలువురు న్యాయవాదులు పలు చట్టాలపై విద్యార్దులకు విపులంగా వివరించారు .కార్యక్రమంలో బార్ అసోసియెషన్ అద్యక్షులు వెంకటయ్య, న్యాయవాదులు, సీఐ రాములు, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### కస్తూర్బా పాఠశాలలో న్యాయమూర్తి ఆకస్మిక తనిఖీ

కొడంగల్ పట్టణంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను శనివారం న్యాయమూర్తి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో వంట గదిని పరిశీలించి విద్యార్దినిలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. వంట గది అపరిశుభ్రంగా ఉండడంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేస్తు పాఠశాల సిబ్బందిపై అగ్రహం వ్యక్తం చేశారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి

## బిజెపి నాయకుల ముందస్తు అరెస్టులు



షాద్‌నగర్‌లో అరెస్టు అయిన బీజేపీ నాయకులు.

**షాద్‌నగర్, సెప్టెంబర్ 16, (ప్రభాతవార్త) :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనున్న నేపథ్యంలో షాద్‌నగర్ నియోజకవర్గంలోని బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్ ముందు మీడియాతో మాట్లాడుతూ... పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా షాద్‌నగర్ నియోజకవర్గంలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇక్కడి ప్రజలను మోసం చేశారని ఆయన ఆరోపించారు. కనీసం లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం స్థలంలో ఇప్పటి వరకు తట్టెడు మట్టిని తీయలేదని, మరి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం ఎలా పూర్తి అయినట్లు అవుతుందని ఆయన ప్రశ్నించారు. రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా ఉండి రెండుసార్లు షాద్‌నగర్ ఎన్నికల ప్రచారంలో లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం కోసం హామీలు గుప్పించి ప్రజల ఓట్లు దండుకున్నారని ఆయన ఆరోపించారు. గత 10 సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టు నిర్మాణం విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో రకాలుగా ఇక్కడి ప్రజలను మోసం చేశాని, షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే క్షేమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రాజెక్టును వెంటనే చేపట్టాలని లేకుంటే షాద్‌నగర్ ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలని ఆయన అన్నారు. భూగర్భ జలాలపై ఆధారపడ్డ నియోజకవర్గ రైతులను ప్రజలను తాగునీరు సాగునీరు విషయంలో ఘోరంగా మోసం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తి కాకముందే ఎన్నికల కోసం ప్రారంభిస్తున్నారని, ప్రజలు గమనించాలని ఆయన కోరారు. అరెస్టులు అయిన వారిలో అందెబాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, దేపల్లి ఆశోక్‌గౌడ్,, కమ్మరి భూపాల్‌చారి, కక్కునూరి వెంకటేష్‌గుప్త, చెట్ల వెంకటేష్, ఋషికేష్ ఉన్నారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కవిత.

**మహేశ్వరం, సెప్టెంబర్ 16, (ప్రభాతవార్త) :**
భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు మహేశ్వర మండల కమిటీ ఆధ్వర్యయంలో తుక్కుగూడ లక్ష్మీ గార్డెన్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సభను శనివారం నిర్వాహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కవిత మండల కార్యదర్శి అలవాల రవికుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నాటి నైజాం కాలంలో గ్రామీణ ప్రాంతాలలో వెట్టి చాకిరి నుంచి పేదలను విముక్తి చేసి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచింది ఎర్రజెండా అన్నారు. దీన్నే వాడికి భూమి కావాలని గ్రామ స్వరాజ్యాలు ఉండాలని నాటి నిజాం సైన్యాలపై గేరిల్లా దళాల ద్వారా నిజాం సైన్యాలు హైదరాబాద్‌కు పారిపోయి నెహ్రుకు లొంగిపోయారని అన్నారు. దొడ్డి కొమరయ్య బలిదానం మల్లు స్వరాజ్యం అరట్ల కమలా దేవి బి.యన్‌రెడ్డి పుచ్చలపల్లి సుందరయ్య కాచం కృష్ణమూర్తి ఇలాంటి అనేక మంది నాయకులు పేదల కోసం నిస్వార్థంగా పోరాడి ఎట్టిచాకరి నుంచి విముక్తి కల్పించారన్నారు. కానీ నేటి పాలకులు హిందూ ముస్లీం ఘర్షణగా చిత్రీకరిస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నారని అన్నారు. నిజాం నవాబు కింద పనిచేసిన వారంతా హిందువులేనని ప్రజలను పీడించింది హిందువులని వారి ఆకృత్యాలకు అదుపులేదని అన్నారు. ఇది కేవలం వ్యక్తి నుంచి విముక్తి కోసం జరిగిన పోరాటంగా నేటి సమాజం అర్థం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు శేఖర్, జిజల్లా కమిటీ సభ్యులు అనేక మంది పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి : శ్రీవర్ధన్‌రెడ్డి



షాద్‌నగర్ తిరంగా ర్యాలీలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు.

**షాద్‌నగర్, సెప్టెంబర్ 16, (ప్రభాతవార్త) :**
సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని శనివారం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణ మెయిర్ రోడ్డులో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, ఆశోక్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 1948 సెప్టెంబర్ 17న రజాకార్ల పాలన నుంచి తెలంగాణకు విముక్త లభించిందని ఆయన గుర్తు చేశారు. నాటి నిజాం పాలన నుంచి తెలంగాణ ప్రాంతానికి విముక్తి కావాలని ఎందరో పోరాటాలు చేశారని, సర్దార్ వల్లభాయ్ పటేల్ తెలంగాణకు విమోచనం కల్పించారని ఆయన అన్నారు. ప్రస్తుతం ఓట్ల రాజకీయాల కోసం తెలంగాణ స్వాతంత్ర్య చరిత్రను మరిపించడానికి సమైఖ్యత దినోత్సవం పేరుతో తెలంగాణ విమోచనం కోసం అమరులైన అమరవీరుల చరిత్రను నేటి యువతకు తెలియజేయకుండా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. విమోచన దినోత్సవాన్ని కర్ణాటక ప్రాంతంలో అధికారికంగా అక్కడి ప్రభుత్వాలు నిర్వహిస్తుంటే మరి కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు అధికారంగా చేయట్లేదని వారు ప్రశ్నించారు. ఉద్యమ సమయంలో పదే పదే మాట్లాడిన కేసీఆర్ నేడు ఎంఐఎం ఒత్తిళ్లకు తలొంచి ఈ చరిత్రను మారుస్తున్నారని వారు ఆరోపించారు. నాడు రజాకార్ల మీద తెలంగాణ సమాజం ఎలా అయితే తిరగబడిందో, నేడు కేసీఆర్ కుటుంబ పాలనపై తెలంగాణ ప్రజలు తిరగబడే రోజు వస్తుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అజాద్ ఇక అమృత్ మహోత్సవాల సందర్భంగా గత సంవత్సరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అధికారికంగా జరిపారు. నిజంగా మన స్వతంత్ర్య సమరయోధులను గుర్తించిదని అన్నారు. ఈ సారి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అధికారికంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అందరికీ గర్వకారణమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రణీత్‌రెడ్డి, రణదీర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, దొడల వెంకటేష్, బోయ కురుమయ్య, సుధాకరప్ప, శివాజీ కంచుకోట మణికంఠ, శ్రవణ్, భరత్, పిట్టల సురేష్,, సాయిగౌడ్, గట్టొజు విజయ్, వివేక్, భీమయ్య, వివిధ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సభకు భారీగా తరలివెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు

**కొడంగల్, సెప్టెంబర్ 16ప్రభాతవార్త**
పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు ప్రారంబోత్సవ కార్యక్రమంతో పాటు సీఎం కేసీఆర్ బహిరంగ సభకు కొడంగల్ నియోజకవర్గం నలుమూలల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్ళారు. శనివారం కొల్లాపూర్ నియోజకవర్గంలోని పాలమూరు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ ,కోస్గీ, మద్దూర్, దుద్యాల, గుండుమాల్, కొత్తపల్లి తదితర మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో భారీగా తరలివెళ్ళారు. సీఎం సభకు తరలివెళ్తున్న వాహనాలకు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి జెండా ఊపగా వాహనాలు కొల్లాపూర్‌కు తరలివెళ్ళాయి. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం చారిత్రక ఘట్టమని ఈ ప్రాజెక్టు ద్వారా కొడంగల్ నియోజకవర్గంలో 1లక్ష17వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. అనంతరం వివిధ వాహనాల్లో బీఆర్ఎస్ శ్రేణులు సీఎం సభకు తరలివెళ్ళారు.

## ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి ఆర్పీల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ఆర్పీలు

**కొడంగల్, సెప్టెంబర్ 16ప్రభాతవార్త**
కొడంగల్ మున్సిపల్ పరిధిలో మెప్మాలో రిసోర్స్ పర్సన్‌లుగా విధులు నిర్వహిస్తున్న తమ డిమాండ్‌ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రిసోర్స్‌పర్సన్‌లు కోరారు. ఈమేరకు వారు శనివారం స్దానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతు పేదరిక నిర్మూలనకై అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు మధ్య నిరంతరం అనుసంధాన కర్తలుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించి గుర్తింపు కార్డులు అందిస్తు రూ.18వేల గౌరవ వేతనం ఇవ్వాలని, జీవిత భీమా కల్పించాలని వినతిపత్రంలో కోరారు. స్పందించి ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళీ డిమాండ్ పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్బంగా ఆర్పీలు అనందమ్మ, అన్నపూర్ణ, రమాదేవి, మంజుల, మల్లేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో పార్కు అభివృద్ధి పనులు



ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో పార్కును పరిశీలిస్తున్న మున్సిపల్ కమీషనర్ సాబేర్‌అలీ, వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ రమాదేవి

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్ 2వ వార్డు పరిధిలోని సీ-2 పార్కు అభివృద్ధి పనులను శనివారం మున్సిపల్ కమీషనర్ సాబేర్‌అలీ, వైఎస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, స్థానిక కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి మహిపాల్‌గౌడ్‌లతో కలిసి పరిశీలించారు. 2వ వార్డులో త్వరలో పార్కు అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని వైఎస్‌చైర్మన్ మాధవరెడ్డి తెలిపారు. ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో అభివృద్ధి పనులు చురుకుగా జరుగుతున్నాయని స్థానిక కౌన్సిలర్ రమాదేవి నిరంతరం పనులను పర్యవేక్షించి అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా కౌన్సిలర్ రమాదేవి కమీషనర్, వైఎస్‌చైర్మన్‌లను శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో ఇంజనీర్ సన్నీ, వార్డు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు యాదగిరిరావు, మాజీ వార్డుసభ్యురాలు విమల, నాయకులు అంజనేయులు, పందిరి శశికళ, సల్ల శివ, యాదయ్య, సిఆర్‌కె.రాజు, సూర్యకాంత్, హనుమంతరావు, లక్ష్మిపతి, సత్యనారాయణ, కృష్ణ, పండిత్, సాంబశివరావు, సత్యంరావు, కాంట్రాక్టర్ సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## మండల బీసీ సంక్షేమ సంఘం పూర్తిస్థాయి కార్యవర్గం



శివారెడ్డిగూడలో ఎన్నికైన మండల బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం సభ్యులు

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండల బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు మండల అధ్యక్షులు మెడబోయిన వెంకటేశ్ తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ శివారెడ్డిగూడలోని బంధన్ ఫంక్షన్‌హాలులో శనివారం బీసీ కులాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా కులసంఘాల నాయకులు చర్చించి ఏకాభిప్రాయంతో అన్ని కుల సంఘాలకు ప్రాధాన్యత కల్పించి జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షులు మెడబోయిన వెంకటేశ్, ప్రధానకార్యదర్శి వరికుప్పల లింగస్వామిల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎంపిక చేసినట్లు తెలిపారు. మండల ఉపాధ్యక్షులుగా న ర్రి శ్రీశైలం, కంది సత్యనారాయణ, మడ్డి రవిగౌడ్, ఎలసాని ఐలయ్యయాదవ్, యంజాల భాస్కర్‌గౌడ్, కోశాధికారిగా నీరుడి కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా మెడబోయిన రాజు, కార్యదర్శులుగా బొంత వెంకటేశ్, దేరంగుల బాల్‌రాజ్, సోమసాని రమేశ్, ఉదారి శంకర్, గుండోజు కృష్ణాచారీ, బైరు పాండుగౌడ్, బోదాసు సురేశ్, పల్లపు శ్యామ్, ప్రచార కార్యదర్శిగా కురుపాల విజయ్‌కుమార్, అచ్చిని దినేశ్, మెంగ బాలకృష్ణ, సుర్వి కృష్ణలను ఎంపిక చేసినట్లు తెలిపారు. మండలంలో సంఘం బలోపేతానికి అందరూ కలిసి కృషి చేయాలని అధ్యక్షులు వెంకటేశ్ కోరారు.

## టీచర్ల బదిలీలు,పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి



.మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఇఓ విజయకుమారిని కలిసి ఉపాధ్యాయుల వినతిపత్రం అందజేసిన జిల్లా పిఆర్‌టియు తెలంగాణ నాయకులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 16, ప్రభాతవార్త**
ఉపాధ్యాయుల బదిలీలు, పధోన్నతులు పారదృకంగ నిర్వహించేలా చూడాలని, పధోన్నతులలో మెడికల్, స్పౌజ్ ధృవపత్రాలను పరిశీలించి డిఎస్‌సి ర్యాంక్ ఆధారంగ సీనియారిటీ లీస్టు తయారు చేయించి వాటిని నిర్వహించేలా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారిని జిల్లా పిఆర్‌టియు తెలంగాణ నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఇఓను కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని జిల్లా పిఆర్‌టియు తెలంగాణ జిల్లా అధ్యక్షులు ఎం.మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.శ్రీధర్, శామీర్‌పేట మండల అధ్యక్షులు రామిడి వెంకట్రామ్‌రెడ్డి, మల్కాజ్‌గిరి మండల అధ్యక్షులు కె.శ్రీనివాస్‌రావు, కాప్ర మండల అధ్యక్షులు ఎన్.మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగుల ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్స్‌కు దరఖాస్తుల స్వీకరణ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 16, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్స్ కోసం దరఖాస్తులు కోరటం జరుగుతుందని మేడ్చల్ జిల్లా సంక్షేమ అధికారి ఎం.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులు అందరు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం ధరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని ఆయన సూచించారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. టిఎస్‌ఓబిఎంఎంఎస్. జిఓవి. ఇన్ వెబ్‌సైట్ నందు 2023అక్టోబరు 31లో ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా వెంకటలక్ష్మి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణం : ప్రధానోపాధ్యాయులు నర్సింహయ్య



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

**పెద్దేముల్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:**
2023 విద్యా సంవత్సరానికి గాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా జి.వెంకటలక్ష్మి ఎంపిక కావడం పాఠశాలకే గర్వకారణమని ప్రదానోపాధ్యాయులు నర్సింహయ్య అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా వెంకటలక్ష్మి ఎంపిక కావడం పట్ల శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలోని కేంద్ర ప్రాథమిక పాఠశాల తరఫున హెచ్‌ఎం ఆమేను సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నర్సింహయ్య మాట్లాడుతూ వెంకటలక్ష్మి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక కావడంతో ఆమేపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దడంతో పాటు క్రమశిక్షణకు మారుపేరు వెంకటలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జే.శ్రీనివాసులు, సి,రవిందర్‌రెడ్డి, బి.నర్సిరెడ్డి, జె.సంగీత, నఫీజ్ సుల్తానా, కే.రాధ తదితరులు పాల్గొన్నారు.

## బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జయక్రిష్ణ



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్చం అందిస్తున్న జయక్రిష్ణ

**బొంరాస్‌పేట్, సెప్టెంబర్ 16ప్రభాతవార్త**
బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షులుగా బొంరాస్‌పేట్ మండలానికి చెందిన జయక్రిష్ణ నియమితులైయ్యారు. ఈ మేరకు శనివారం హైద్రాబాద్‌లో టీపీసీసీ అద్యక్షులు రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియమకపు పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు టీపీసీసీ అద్యక్షులు రేవంత్‌రెడ్డి తనపై ఎంతో నమ్మకంతో కొడంగల్ తాలూకా బ్లాక్ కాంగ్రేస్ అద్యక్ష బాధ్యతలు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు నియోజకవర్గంలో కాం గ్రేస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట్, దుద్యాల, దౌల్తాబాద్ మండలాల్లో కాంగ్రేస్ పార్టీ అద్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో మమేకమై పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో కొడంగల్‌లో రేవంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. గతకొంత కాలంగా ప్రజల్లో కాంగ్రేస్ పార్టీపై భరోసా పెరిగిందని అందుకే రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రేస్ పార్టీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయని అన్నారు. కొడంగల్ కాంగ్రేస్ పార్టీలో విబేధాలు లేకుండా నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపై ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రేస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మాజీ మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఎం.ఎ.వాహీద్



మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న టీపీసీసీ మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.వాహీద్

**వికారాబాద్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:**
టీపీసీసీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఎం.ఎ.వాహీద్ ను నియమిస్తూ టీపీసీసీ మైనార్టీసెల్ చైర్మన్ షేక్ అబ్దుల్లా సోహైల్ ఈ మద్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎం.ఎ.వాహీద్ శనివారం మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వాహీద్ మాట్లాడుతూ..తనకు ఈ పదవి రావడానికి కారణమైన ప్రసాద్‌కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపడం జరిగిందని పేర్కొన్నారు. రానున్న అసెబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. ప్రతి మైనార్టీ ఓటరు గడప తట్టి కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరుతానని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మైనార్టీలకు ఎన్నో హామీలు ఇచ్చారని, ఆచరణలో అమలు చేసింది శూన్యమని, ఈ విషయాలను మైనార్టీ సోదరులకు అర్థమయ్యే రీతిలో అవగాహన చేస్తానని తెలిపారు. పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేస్తానని, ముఖ్యంగా వికారాబాద్ ప్రాంతం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్ గెలుపునకు శాయ శక్తుల కృషి చేస్తానని పేర్కొన్నారు. గతంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా పదవి చేపట్టానని, ప్రస్తుతం రాష్ట్ర స్థాయి పదవి తనకు రావడం ఎంతో ఆనందంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు



తిరుపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు

**దౌల్తాబాద్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కౌడీడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు మైనోద్దీన్, ఖాసీంతో పాటు పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతి రెడ్డి సమక్షంలో వారు కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువాలతో ఆయన ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకు కలిసికట్టుగా కృషి చేయాలని తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

**కొడంగల్, సెప్టెంబర్ 16ప్రభాతవార్త**
మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో ఓ ఆవు శుక్రవారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. బాధిత రైతు కథనం మేరకుగ్రామానికి చెందిన చాకలి చిన్నమ్మ కుమారుడు రఘు రోజు మాదిరిగా తన అవులను పొలంలోని పశువుల కొట్టంలో కట్టేసి ఇంటికి వెళ్ళాడు. శుక్రవారం రాత్రి సమయంలో అవు తలుగు తెంపుకొని మేత మేయడానికి వెళ్ళింది. పొలంలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ దగ్గర అవు మేత మేస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందింది. శనివారం ఉదయం రఘు పశువుల కొట్టానికి వచ్చి చూడగా అవు ట్రాన్స్ ఫార్మర్ సమీపంలో మృతిచెందడం గమనించాడు. దీంతో విద్యుత్ సిబ్బందికి, పశు వైద్యాధికారులకు సమాచారం అందించారు. పశు వైద్యాధికారి రియాజ్ అహ్మద్ సంఘటనా స్దలానికి చేరుకొని పరిశీలించారు. అవు మృతి చెందడంతో రూ.60వేలు ఉంటుందని. ప్రభుత్వం స్పందించి ఆర్థిక సహాయం అందించాలని బాధిత రైతు కోరారు.



మృతిచెందిన అవును పరిశీలిస్తున్న పశువైద్యాధికారి